నార్సింగ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌మెయిలింగ్, బెదిరింపులకు తాళలేక ఓ వ్యక్తి చిన్నపిల్లలైన ముగ్గురు కొడుకుల్ని చంపి, తాను ఆత్మహత్య చేసుకున్న కేసులో మొకిలా పోలీసులు ఐదుగురు విలేకరులు, హోంగార్డు సహా 9 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ నెల 3న శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామంలో నీరటి రవి అనే వ్యక్తి తన ముగ్గురు పిల్లలను హత్య చేసి, తాను ఆత్మహత్య చేసుకున్నాడు. రవి జీఎస్ఎన్ కంపెనీలో మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లో కొంతమంది చేత డబ్బులు పెట్టించాడు. అయితే ఆ కంపెనీ నుంచి డబ్బులు తిరిగి రాలేదు. ఈ విషయం తెలిసి ఈ ఐదుగురు విలేకర్లు రవిని బెదిరించారు. తమకు డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. రవి తన వద్ద డబ్బులు పెట్టిన నాగరాజు అనే హోంగార్డు, అతని భార్య మనీలాకు రెండు ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇచ్చినప్పటికీ వారు కూడా తీవ్రంగా ఒత్తిడి చేశారు. తిరుపతిరావు, రామకృష్ణ అనే వ్యక్తులు, నాగరాజు, మనీలాతో పాటు విలేకర్లు కురమ శ్రీనివాస్ (ఈనాడు), మంగళి శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి), వడ్డె మహేశ్ (నమస్తే తెలంగాణ), సిరిపురం శ్రీనివాస్‌రెడ్డి (వార్త), సనికె ప్రవీణ్ కుమార్ (సాక్షి)పై కేసు నమోదు చేశామని డీసీపీ తెలిపారు. విషయం తెలిసి ఆంధ్రజ్యోతి యాజమాన్యం వారం రోజుల క్రితమే మంగళి శ్రీనివాస్‌ను తొలగించింది. ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజును అరెస్టు చేసిన పోలీసులు... మిగతా వారి కోసం గాలిస్తున్నారు.

మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా మర్రి?

నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేతో కొనసాగుతున్న సంప్రదింపులు



ఒకట్రెండు రోజుల్లో ప్రకటన!

నాగర్‌కర్నూల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి త్వరలోనే హస్తం గూటికి చేరనున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బుధవారం నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఈ వాదనకు మరింత బలం చేకూరింది. శాసనసభ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి మర్రి జనార్దన్‌రెడ్డి పార్టీ మార్పుపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఆయనకు ఆహ్వానాలు అందాయి. జహీరాబాద్ నుంచి బీజేపీ తరఫున లోక్‌సభకు పోటీ చేయాల్సిందిగా ఆ పార్టీ నేతలు సంప్రదింపులు జరిపారు. అదేసమయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన మర్రి జనార్దన్‌రెడ్డి.. బీజేపీ నాయకులు తనను సంప్రదించిన మాట వాస్తవమేనన్నారు. కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో చర్చించకుండా తాను నిర్ణయం తీసుకోబోనని చెప్పారు. అయితే, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా జనార్దన్ రెడ్డిని ప్రకటించనున్నట్లు బలంగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి మల్కాజిగిరి లేదా మహబూబ్‌నగర్ స్థానాల్లో పోటీ చేయాలని ఆఫర్ ఉన్నా.. జనార్దన్‌రెడ్డి ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఈ క్రమంలో ఆయన్ను మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడం లాంఛనమేనని తెలుస్తోంది. కాగా, పార్టీ మారే అంశంపై జనార్దన్ రెడ్డి మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. కాంగ్రెస్, బీజేపీలు తనను సంప్రదిస్తున్నా.. తాను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారు. ఒకటి రెండు రోజుల్లోనే ఈ విషయంపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

అధిష్ఠానం మాటే.. మా మాట!

- అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ నేతలు

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా ఎంపిక చేస్తే వారిని గెలిపించుకుంటామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని 13 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ గాంధీభవన్‌లో బుధవారం భేటీ అయ్యారు. టికెట్ల కేటాయింపుపై అభిప్రాయాలు సేకరించారు. ఇందులో భాగంగా మెజారిటీ నేతలు అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కొద్ది మంది మాత్రం ఫలానా అభ్యర్థి అయితే సామాజికంగా, ఆర్థికంగా సరైన పోటీదారు అని అభిప్రాయాలు చెప్పారు. ఇదిలాఉంటే, ఆయా నియోజకవర్గాలకు చెందిన ఆశావహులు.. తమ పేరును ప్రతిపాదించాలని పార్టీ నేతలను ఫోన్లు, మెసేజ్‌ల ద్వారా విజ్ఞప్తి చేయడం కొసమెరుపు.

అధినేత వద్దకు ఆరూరి

వరంగల్ టు హైదరాబాద్.. హైడ్రామా.. బీజేపీలో చేరొద్దంటూ బుజ్జగించేందుకు వెళ్లిన ఎర్రబెల్లి, సారయ్య, బీఆర్ఎస్ నేతలు



ఆరూరిని బీఆర్ఎస్ నేతలు తీసుకెళుతుండగా అడ్డుకుంటున్న అనుచరులు

హైదరాబాద్/వరంగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో చేరేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ ఇంటి వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించేందుకు బుధవారం ఉదయం ఆయన ఏర్పాట్లు చేసుకోగా.. బీఆర్ఎస్ నేతలు ఆయన్ను పార్టీ అధినేత కేసీఆర్ వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రమేశ్ అనుచరులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగి, ఉద్రిక్తతకు దారి తీసింది. పార్టీలో తనకు అన్యాయం జరిగిందని, ఈ సమయంలో తన నిర్ణయాన్ని మార్చుకోలేనని రమేశ్ చెప్పినా బీఆర్ఎస్ నేతలు వినిపించుకోకపోవడం, మార్గం మధ్యలో బీజేపీ నాయకులు వారి వాహనాలను అడ్డుకొని ఆందోళన చేపట్టడం.. కలకలం రేపింది. ఆరూరి కిడ్నాప్ అంటూ సోషల్‌మీడియాలో ఈ విషయం వైరల్ కావడంతో వరంగల్ నుంచి బయలుదేరిన వీరి వాహనాలు హైదరాబాద్ చేరుకునే దాకా ఉత్కంఠ కొనసాగింది. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేశ్ బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, సాయంత్రం ఢిల్లీకి వెళ్లి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సమక్షంలో పార్టీలో చేరాలని భావించారు. అనుకున్నట్లుగానే వరంగల్‌లోని తన నివాసం వద్ద ముఖ్య అనుచరులతో సమావేశమైన ఆరూరి.. పార్టీలో తనకు గుర్తింపు దక్కడం లేదని, మళ్లీ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసినా తనను ఓడిస్తారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఉదయం 11గంటల సమయంలో మీడియాతో మాట్లాడేందుకు ఆయన ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా.. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్ఎస్ నేతలు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, సుందర్‌రాజ్ అక్కడికి చేరుకున్నారు. 'ఒక్క నిమిషం మాట్లాడుదాం' అంటూ ఇంట్లోకి తీసుకెళ్లారు. బీజేపీలోకి వెళ్తే భవిష్యత్తు ఉండదని, పార్టీ మారొద్దని బుజ్జగించేందుకు ప్రయత్నించారు. అంతలోనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకుని, రమేశ్ భుజంపై చేయి వేసి కేసీఆర్ వద్దకు వెళ్దామంటూ బయటకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఆరూరి మద్దతుదారులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. ఆరూరి అనుచరులు కారుకు అడ్డుగా నిలబడి నినాదాలు చేశారు. చివరకు ఉద్రిక్తత మధ్య రమేశ్‌ను తీసుకుని హైదరాబాద్‌కు బయల్దేరగా.. మార్గ మధ్యలోని జనగామ జిల్లా పెంబర్తి వద్ద బీజేపీ నాయకులు వారి వాహనాన్ని అడ్డుకొని ఆందోళనకు దిగారు. బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో 50మంది కార్యకర్తలు ఆరూరి రమేశ్‌ను బలవంతంగా కారులో నుంచి కిందకు దించారు. ఈ పెనుగులాటలో ఆరూరి రమేశ్ చొక్కా చినిగిపోయింది. బీఆర్ఎస్ నాయకులు బుజ్జగించాలని ప్రయత్నిస్తే మీరెలా వెళ్తారంటూ వారు నిలదీశారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి దశమంతరెడ్డి ఫోన్ చేసి చెప్పారు. అక్కడే ఉన్న రమేశ్‌తో కిషన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. తాను వ్యక్తిగత పనుల నిమిత్తమే ఎర్రబెల్లితో కలిసి హైదరాబాద్ వెళ్తున్నానని, ఇచ్చిన మాట ప్రకారం బీజేపీలో చేరేందుకు సిద్ధంగానే ఉన్నానని రమేశ్ చెప్పారు. కిషన్‌రెడ్డి సూచన మేరకు బీజేపీ నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఉద్రిక్తత మధ్య రమేశ్‌తోపాటు బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు.

బీఆర్ఎస్ నుంచి పోటీకి ఆరూరి నో?

వరంగల్ పార్లమెంట్ స్థానానికి సంబంధించిన అభ్యర్థిత్వంపై చర్చించేందుకు పార్టీ నాయకులతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమావేశమ్యారు. ఈ సందర్భంగా ఆరూరి రమేశ్ పేరును ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వయంగా ప్రతిపాదించగా.. మిగతా నేతలు మొగ్గు చూపారు. కానీ, ఎంపీ అభ్యర్థిగా తాను పోటీ చేసేది లేదని ఆరూరి స్పష్టం చేసినట్టు సమాచారం. ఇంత జరిగిన తర్వాత ఎంపీగా పోటీ చేయనని, అదే సమయంలో పార్టీ కూడా మారనని, పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా కలిసి పని చేస్తానని ఆరూరి అధినేతకు చెప్పినట్టు తెలిసింది. దీంతో కేటీఆర్ కలుగజేసుకుని రమేశ్‌ను ఒప్పించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. "అధికారంలో లేమని.. హైరానా పడకండి.. తెలంగాణలో బీఆర్ఎస్‌దే భవిష్యత్తు అనే విషయాన్ని తెలుసుకోండి. అనవసర నిర్ణయాలతో రాజకీయ భవిష్యత్తు పాడు చేసుకోవద్దు" అని రమేశ్‌ను ఉద్దేశించి కేసీఆర్ వ్యాఖ్యానించినట్టు తెలిసింది. చివరకు అనూహ్యంగా వరంగల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను కేసీఆర్ ప్రకటించారు.

నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు: ఆరూరి


"నన్నెవరూ అడ్డుకోలేదు.. బీఆర్ఎస్ నేతలు కిడ్నాప్ చేయలేదు.. వరంగల్ నేతలతో అధినేత కేసీఆర్ నిర్వహిస్తున్న సమావేశంలో పాల్గొనేందుకే హైదరాబాద్ వచ్చా" అని ఆరూరి రమేశ్ పేర్కొన్నారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని స్పష్టం చేశారు. తమ పార్టీ నేతలే నన్ను తీసుకుని వచ్చారని వెల్లడించారు. అమిత్‌షా సహా బీజేపీ నేతలెవరినీ తాను కలవలేదని పేర్కొన్నారు.




కాసాని జ్ఞానేశ్వర్



కడియం కావ్య



బాజిరెడ్డి గోవర్ధన్



గాలి అనిల్‌కుమార్

చేవెళ్ల నుంచి కాసాని, వరంగల్ నుంచి కావ్య

- నిజామాబాద్‌లో బాజిరెడ్డి, జహీరాబాద్‌లో అనిల్

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాలుగు పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను పార్టీ అధినేత కేసీఆర్ బుధవారం ప్రకటించారు. పార్టీ ముఖ్య నేతలతో చర్చల అనంతరం వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కడియం కావ్య పోటీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అదే విధంగా చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్, జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ పేర్లను ప్రకటించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో 50శాతానికి పైగా బీసీలే ఉండడం, గతంలో ఆర్మూర్, బాన్సువాడ ఎమ్మెల్యేగా పని చేసి ఉండడం, జిల్లాలో అందరికీ తెలిసిన వ్యక్తిగా పేరుండడంతో బాజిరెడ్డి గోవర్ధన్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. మరోవైపు, జహీరాబాద్ సిటింగ్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరడంతో ఆ స్థానానికి పటాన్‌చెరువుకు చెందిన సీనియర్ నేత అనిల్ కుమార్‌ను ఎంపిక చేశారు. పార్టీలో చాలా కాలంగా పని చేస్తుండడం, బీసీ అభ్యర్థి కావడం కలిసొస్తుందన్న అంచనాతో ఆయన ఎంపిక జరిగింది. తాజా ప్రకటనతో మొత్తం తొమ్మిది పార్లమెంటు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది.

కష్టకాలంలో కాంగ్రెస్ ఉనికిని కాపాడాం

పదేళ్లుగా కేసీఆర్ ఆధిపత్యాన్ని ఎదుర్కొన్నాం.. మెదక్ లోక్‌సభ టికెట్ నాకు ఇవ్వండి

- నేనూ నా భర్త జగ్గారెడ్డి గెలిపించుకొస్తాం
- దీపాదాస్ మున్షీని కోరిన నిర్మలా జగ్గారెడ్డి



హైదరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): "గడిచిన పదేళ్లుగా కేసీఆర్ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటూ మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కాపాడుకొచ్చాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తే.. పోటీ చేసి ఉనికిని చాటాం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ టికెట్‌ను నాకు ఇస్తే.. గెలిపించి ఇస్తామ"ని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి సతీమణి, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కోరారు. మెదక్ లోక్‌సభ స్థానంలో గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ గెలవలేదని, బీసీ మహిళ అయిన తనకు టికెట్ ఇస్తే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి 13 నియోజకవర్గాలకు చెందిన డీసీసీల అధ్యక్షులు, పార్టీ ఎమ్మెల్యేలు, గతంలో పోటీ చేసిన అభ్యర్థులతో బుధవారం గాంధీ భవన్‌లో దీపాదాస్ మున్షీ సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో నిర్మలా జగ్గారెడ్డితో సమావేశమైనప్పుడు ఆమె స్థానికంగా తాను, తన భర్త జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీని ఎలా కాపాడుకుంటూ వచ్చిందీ వివరించారు. జిల్లాలో గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటూ వస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను బీఆర్ఎస్‌లో చేర్చుకుందని గుర్తుచేశారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు మెదక్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తే.. పార్టీ ఉనికిని చాటేందుకు తాను పోటీ చేశానన్నారు. మెదక్‌లో కాంగ్రెస్‌కు ఉన్న ప్రజాప్రతినిధుల కంటే అదనంగా 9 ఓట్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇప్పుడు మెదక్ సీటు కోసం చాలామంది వస్తున్నారని, కష్టకాలంలో పార్టీని కాపాడుకుంటూ వచ్చిన తమకు టికెట్ కేటాయించాలని కోరారు. బాగారెడ్డి తర్వాత గడిచిన 30 ఏళ్లలో మెదక్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరూ గెలవలేదని, తనకు మెదక్ టికెట్ కేటాయిస్తే తాను, తన భర్త జగ్గారెడ్డి కలిసి గెలిపించుకుని వస్తామన్నారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ తన అభ్యర్థనపై అధిష్ఠానం సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నానని చెప్పారు. జగ్గారెడ్డి సైతం దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులను కలిసి తన భార్యకు మెదక్ టికెట్ ఇవ్వాలని కోరారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జిల్లాలో ఎలా కాపాడుకుంటూ వచ్చిందీ, సంగారెడ్డిలో రాహుల్ సభను, భారత్ జోడో యాత్రను విజయవంతంగా నిర్వహించిన తీరును వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశం

బీజేపీకి లేదు

- పడగొట్టుకుంటే మీరే బాధ్యులు:లక్ష్మణ్

హైదరాబాద్, ముషీరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాము రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కోరుకోవడం లేదని బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ తెలిపారు. 8 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేస్తుందంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బుధవారం ఓ ప్రకటనలో అలాగే ముషీరాబాద్‌లోని కషీష్ హాల్‌లో జరిగిన మోదీ పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమంలో స్పందించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. "కాంగ్రెస్ నేతలు... వారంతట వారే తగవు పడి ప్రభుత్వాన్ని పడగొట్టుకుంటే బాధ్యత వారిదే" అని వ్యాఖ్యానించారు. చచ్చిన పామైపోయిన.. బతికి బట్టగట్టే పరిస్థితే లేని బీఆర్ఎస్ పార్టీని బతికించే అగత్యం బీజేపీకి లేదన్నారు. బీఆర్ఎస్‌తో కలిసి బీజేపీ కుట్ర పన్నుతోందంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఈమేరకు స్పందించారు. మా ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కాపాడతారని సీఎంయే పేర్కొంటూ ప్రభుత్వం పడిపోతుందని ఎందుకు భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటయ్యాయని వారి మాటల్లోనే అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల, ఆ పార్టీ విధానాల పట్ల రేవంత్‌రెడ్డికి విశ్వాసం ఉంటే.. ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని ప్రకటించాలని సవాల్ విసిరారు.

స్వార్థం కోసమే విమోచన దినం:తమ్మినేని

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేయడాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇది చరిత్రను వక్రీకరించడమే అని బుధవారం పేర్కొన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ నోటిఫికేషన్ విడుదల చేశారని, తక్షణమే దానిని ఉపసంహరించుకోవాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

అరుణకు సై.. జితేందర్‌కు నై!

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ సీటు కేటాయించగా అక్కడ ఆయన ఓటమి పాలయ్యారు. పైగా డీకే అరుణకు టికెట్ ఇస్తేనే గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని బీజేపీ పెద్దలు భావించినట్లు సమాచారం. ఆదిలాబాద్ నుంచి సిటింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని మూడు రోజుల పార్టీలో చేరిన గోడెం నగేశ్‌కు టికెట్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. 2014లో నగేశ్ బీఆర్ఎస్ తరఫున ఆదిలాబాద్ నుంచి ఎంపీగా గెలిచారు. 2019లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు చేతిలో ఓటమిపాలయ్యారు. కాగా ఆదిలాబాద్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు సోయం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారని, ఇదే ప్రభావం చూపించదనే చర్చ నడుస్తోంది. ఇదివరకే మొదటి జాబితాలో తెలంగాణ నుంచి తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో మొత్తం 17 స్థానాలకు గాను 15 స్థానాల్లో అభ్యర్థులను అభ్యర్థులను ప్రకటించినట్లయింది. వీరిలో ఇద్దరు మహిళా అభ్యర్థులు మాధవీలత (హైదరాబాద్), డీకే అరుణ (మహబూబ్‌నగర్) ఉన్నారు.

పెండింగ్‌లో ఖమ్మం, వరంగల్ స్థానాలు

తెలంగాణ నుంచి బీజేపీ ప్రకటించాల్సిన స్థానాలు ఇక రెండే రెండు ఉన్నాయి. ఖమ్మం, వరంగల్! మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కుమారుడు మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఇటీవలే బీజేపీలో చేరారు. ఖమ్మం లోక్‌సభ నుంచి వెంకట్రావ్ బరిలో ఉంటారని ప్రచారం జరిగింది. రెండో జాబితాలో ఆయన పేరును ప్రకటిస్తారనీ పార్టీ వర్గాలు చెప్పాయి. చివరి నిమిషంలో ఆయన పేరును జాబితాలో చేర్చలేదు. బీఆర్ఎస్ నుంచి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ కీలక నేత బీజేపీలో చేరనున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఖమ్మం స్థానాన్ని పెండింగ్‌లో పెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక వరంగల్ నుంచి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను రంగంలోకి దింపాలని బీజేపీ చూసింది. ఆయనతో చర్చలు కూడా జరిపింది. రమేశ్ బుధవారం పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని ఆయన ప్రకటించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఆరూరి సమావేశమయ్యారు. వీటన్నింటి నేపథ్యంలో వరంగల్ నుంచి మాజీ ఐపీఎస్ కృష్ణ ప్రసాద్ అభ్యరిత్వాన్ని దాదాపుగా ఖరారు చేసినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి.





రెండో జాబితాలో గడ్కరీ, గోయల్, అనురాగ్ ఠాకూర్‌కు

ఓవరాల్‌గా రెండో జాబితాలో నితిన్ గడ్కరీ (నాగపూర్), ప్రహ్లాద్ జోషి (ధార్వాడ్), పీయూష్ గోయల్ (ముంబై నార్త్), అనురాగ్ ఠాకూర్ (హమిర్‌పూర్) తోపాటు మాజీ ముఖ్యమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్(కర్నాల్), త్రివేంద్రసింగ్ రావత్ (హరిద్వార్), బసవరాజ్ బొమ్మై (హవేరీ)కి చోటు దక్కింది. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యాడ్యూరప్ప తనయుడు రాఘవేంద్ర.. షిమోగ లోక్ సభ స్థానం నుంచి బరిలో నిలవనున్నారు. దేశంలో మొత్తం 543 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. తొలి జాబితాలో 195 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో మొత్తంగా 267 స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించినట్లయింది. ఎన్డీఏ కూటమిలో భాగంగా కొన్ని రాష్ట్రాల్లో అవగాహనతో ముందుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది. అందులో భాగంగానే మరి కొన్ని రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్నాయి. పొత్తులు, పోటీ చేసే సీట్ల విషయంలో పూర్తి అవగాహనకు వచ్చాక మిగిలిన లోక్‌సభ స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించాలని బీజేపీ భావిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

16న నాగర్‌కర్నూల్‌కు మోదీ

భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు

నాగర్‌కర్నూల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాగర్‌కర్నూల్ పర్యటన ఖరారయింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని శనివారం(16న) నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారు. దాంతో వెలమ సంఘం కల్యాణ మండపం పక్కన భారీ బహిరంగ సభ నిర్వహణకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రముఖ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సన్నాహక సమావేశం జరిగింది. మోదీ తొలిసారి నాగర్‌కర్నూల్‌కు వస్తున్నందున భారీ ఎత్తున జనసమీకరణ చేయాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. అందుకోసం సభకు ఉమ్మడి జిల్లా, బీజేపీ పట్టు ఉన్న ప్రాంతాల నుంచే కాకుండా మిగతా నియోజకవర్గాల నుంచి కూడా జనాన్ని తరలింగే ప్రయత్నాలు చేస్తున్నారు.

విమోచన గెజిట్‌పై బీజేపీ హర్షం

సెప్టెంబరు 17ను హైదరాబాద్ విమోచన దినంగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలకు కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ స్వాతంత్ర్యం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయులందరికీ సరైన గౌరవం దక్కిందన్నారు. అభినవ సర్దార్ వల్లభాయ్ పటేల్ అయిన అమిత్ షా నేతృత్వంలో సెప్టెంబరు 17న విమోచన దినోత్సవంగా నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ కావడం చారిత్రాత్మకమన్నారు.

నృసింహుడికి అలంకార శోభ


విద్యుద్దీపాల కాంతుల్లో యాదగిరిగుట్ట స్వాగత ద్వారం


మత్స్యవాహనాన్ని ఊరేగిస్తున్న అర్చకులు


విద్యుద్దీపాల కాంతిలో ధగధగలాడుతున్న నృసింహుడి ఆలయం

యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామివారు అలంకార సేవలను తిరుమాడవీధుల్లో భక్తి శ్రద్ధల నడుమ ఊరేగించారు. ఉదయం వేళ స్వామి మత్స్యావతారంలో, రాత్రివేళ శేషవాహన సేవలో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా యాదగిరిక్షేత్రంపై ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల అలంకరణ ఆకట్టుకుంది.


మత్స్యావతారంలో నృసింహుడిని ఊరేగింపునకు సిద్ధం చేస్తున్న అర్చకులు



శేషవాహనుడిని కొలుస్తున్న అర్చకులు, శేషవాహనంపై స్వామివారు


మత్స్యావతారంలో స్వామివారు

తండాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


వేల్పుపల్లిలో బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య

తుర్కపల్లి/ ఆలేరు రూరల్, మార్చి 13: మారుమూల గిరిజన తండాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని వేల్పుపల్లి నుంచి గుజ్జవానికుంట, జంగారెడ్డి కుంట, చిన్నలక్ష్మాపూర్ గ్రామంలో పొట్టిమర్రి తండా నుంచి నాగాయపల్లి వరకు సుమారు రూ.5.10కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెద్దతండ పంచాయతీ పరిధిలోని సూక్యతండ, చోక్లతండ పంచాయతీ పరిధిలోని పీర్యాతండ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వార చేపట్టిన సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఆలేరు నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు అవుతున్నాయని పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తానన్నారు. ప్రతీ గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5లక్షల చొప్పున మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, ఎంపీడీవో పి.జాన్సీలక్ష్మీబాయి, ఎంపీటీసీలు గిద్దె కరుణాకర్, ధనావతు మోహన్‌బాబు, కోమటిరెడ్డి సంతోషభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ గుట్ట బ్లాక్ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, ఆలేరు మాజీ మార్కెట్ చైర్మన్ ధనావతు శంకర్‌నాయక్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్స్ చాడ భాస్కర్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించం: బీర్ల


ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరులోని తహసీల్దార్ కార్యాలయంలో 59జీవో కింద 58 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు స్థానిక తహసీల్దార్ చొరవ చూపాలని, సరైన విచారణ జరిపి వారిపై విచారణ తీసుకోవాలన్నారు. నెల రోజుల్లోనే జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఎంపీపీ గంధమల్ల అశోక్, మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రాజు, ఎజాజ్, చింతలఫని శ్రీనివాస్‌రెడ్డి, సంగు భూపతి ఉన్నారు.

మొల్లమాంబ జీవితం స్ఫూర్తిదాయకం


మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించిన అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్/ సంస్థాన్‌నారాయణపురం, మార్చి 13: తెలుగు ప్రజలకు మొట్టమొదటగా రామాయణ విశిష్టతను తెలియజేసిన ఘనత కవయిత్రి మొల్లమాంబదని, ఆమె జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరిలోని కుమ్మరివాడలో బుధవారం మొల్లమాంబ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన మహా కవయిత్రి మొల్లమాంబ అని కొనియాడారు. కుమ్మరి కులస్థుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, టీపీసీసీ సభ్యులు తంగెళ్లపల్లి రవికుమార్, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు తాడూరి అంజయ్య, కార్యదర్శి బాల శంకర్, మరికొండ మల్లేశం, తాడూరి చంద్రయ్య, తాడూరి కిష్టయ్య, తాడూరి నర్సింహ పాల్గొన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాదేవి ప్రేమ్చందర్‌రెడ్డి, ఎంపీటీసీ బచ్చనగోని గాలయ్య, కుమ్మర సంఘం అధ్యక్షుడు చిలువేరు నరసింహ, చిలువేరు అంజయ్య, ఏపూరి సతీష్, చిలివేరు అంజయ్య, గుత్త ప్రేమ్‌చందర్‌రెడ్డి, మందుగుల బాలకృష్ణకొండేటి నరసింహ, చంద్రారెడ్డి, ముత్యాలు పాల్గొన్నారు

'ట్రైకోగ్రామా'తో శత్రు పురుగుల నివారణ


రైతుకు ట్రైకోగామా కార్డులను అందజేస్తున్న ట్రైనీ విద్యార్థులు

మోటకొండూర్, మార్చి 13: రైతులు తమ వరిపొలంలో ట్రైకోగ్రామ్మా కార్డుల వాడకం ద్వారా ఎలాంటి రసాయనిక పురుగు మందుల వాడకం లేకుండా చేనులోని శత్రు పురుగులను నివారించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ కళాశాల విద్యార్థులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వరి పంటను విద్యార్థులు పరిశీలించారు. వరి పంటలో తెగుళ్ళ, పురుగుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలోని చీడపీడల నివారణలో జీవనియంత్రణ ప్రయోగశాలలో ఉత్పత్తి చేసే ట్రైకోగ్రామ్మా కార్డులనుంచి విడుదల చేసే మిత్ర పురుగుల సాయంతో అనేక రకమైన శత్రు పురుగులను సహజ సిద్ధంగానే నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పుట్టపాక సౌమ్య, సభాబేగం, హుడనిలోఫర్, షాలిని విశెట్టి, హన్సికరెడ్డి, రైతు బొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో పూర్తి స్థాయి వైద్య సేవలు ప్రారంభించాలి


ఎయిమ్స్‌లో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

బీబీనగర్, మార్చి 13: ఎయిమ్స్‌లో పూర్తి స్థాయి వైద్య సేవలను ప్రారంభించి, ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ నేతలతో కలిసి ఎయిమ్స్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు సుమారు 1500 మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నప్పటికీ సరిపోను ఓపీ కౌంటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎయిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్యం కోసం వచ్చే రోగులకు ప్రభుత్వం ఉచితంగా భోజనం అందించాలని కోరారు. ఆయన వెంట సీపీఎం నాయకులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు గౌడ్, గడ్డం వెంకటేశ్, గాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి వృద్ధుడి తరలింపు

భువనగిరి రూరల్, మార్చి 13: యాదగిరిగుట్ట బస్టాండ్‌లో కొన్ని రోజులుగా నివసిస్తున్న వృద్ధుడిని(65) భువనగిరి శివారులోని రాయిగిరి సహృదయ అనాథాశ్రమానికి తరలించారు. వృద్ధుడి గురించి స్థానికులు ఆశ్రమ నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆ వృద్ధుడిని ఆశ్రమానికి తరలించారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక

● **మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు**

భువనగిరి టౌన్, మార్చి 13: బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారంటూ పార్టీలకతీతంగా కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం జరిగిన భువనగిరి మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో 41 ఎజెండా అంశాలు ఏకగ్రీవంగా ఆమోదం పొందినప్పటికీ సుమారు ఏడు నెలల అనంతరం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు సమస్యలను కౌన్సిలర్లు లేవనెత్తారు. కాంగ్రెస్‌కు చెందిన పడిగెల రేణుక మాట్లాడుతూ ఇందిరానగర్‌లో మురుగునీటి కాల్వల నిర్వహణ అధ్వానంగా మారిందని, సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందన్నారు. ఆ పార్టీకే చెందిన ఈరపాక నర్సింహ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమాలకు, జిల్లా అదనపు కలెక్టర్ వాహనానికి డీజిల్ బిల్లును మునిసిపల్ నిధుల నుంచి ఎలా చెల్లిస్తారని నిలదీశారు. బీజేపీకి చెందిన రత్నపురం బలరాం మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న మురుగునీటి కాల్వల సమస్యను పరిష్కరించాలన్నారు. అదే పార్టీకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ ఊదరి లక్ష్మి మాట్లాడుతూ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నిర్మించిన భవనాల నుంచి ఆస్తిపన్నును ఎందుకు వసూలు చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య మాట్లాడుతూ రాయిగిరి, బస్టాండ్ వద్ద ప్రజల సౌకర్యార్థం మూత్రశాలలు నిర్మించాలని, పట్టణంలో శానిటేషన్ వ్యవస్థ కుప్పకూలిందన్నారు. కాంగ్రెస్‌కు చెందిన పచ్చర్ల హేమలత, వడిచర్ల లక్ష్మి, బీఆర్ఎస్‌కు చెందిన ఇట్టబోయిన సబిత, కడారి ఉమ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం లోపించిందని, వీధి కుక్కలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, శిథిలమైన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను నాటాలన్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్ వెంకటేశ్వర్లు స్పందిస్తూ కౌన్సిలర్ల సూచనలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. పట్టణంలో వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిపారు. గత పాలక పక్షానికంటే మెరుగైన సేవలు, పారదర్శక పాలన అందిస్తామన్నారు. కమిషనర్ పి.రామాంజులరెడ్డి మాట్లాడుతూ కౌన్సిలర్లు పేర్కొన్న అంశాలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్టణ సమస్యల పరిష్కారానికి కౌన్సిల్, మునిసిపల్ యంత్రాంగం కలిసి పని చేస్తుందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మహిళా కౌన్సిలర్లు, సిబ్బందిని చైర్మన్, కమిషనర్ సత్కరించారు.


మహిళా కౌన్సిలర్లను సన్మానిస్తున్న పాలకవర్గం

తరగతి గదిలోనే సమాజ భవిష్యత్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు/ అడ్డగూడూరు, మార్చి 13: తరగతి గదిలోనే సమాజ భవిష్యత్ తీర్చిదిద్దబడుతుందని, ఉపాధ్యాయులు ఉత్తమ విద్యనందించనట్టయితే సమాజం గతి తప్పుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ పాఠశాలలో చదువుకున్న తాను ఈ పాఠశాలకు ఎమ్మెల్యే స్థాయిలో రావడం ఆనందంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చుతున్నారని, అందుకే ఉపాధ్యాయులు తమ పిల్లలను తాము పనిచేసే పాఠశాలల్లోనే చదివించాలన్నారన్నారు. ప్రాధాన్య క్రమంలో ఈ ప్రాంత సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానన్నారు. మోత్కూరుకు డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్‌డిపో సాధిస్తానన్నారు. హెచ్ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన వీడ్కోలు సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, రిటైర్డు ఎంఈవో బద్దం యాదిరెడ్డి, కౌన్సిలర్లు కారుపోతుల శిరీష, లెంకల సుజాత, కోఆప్షన్ సభ్యురాలు పి.ఆనందమ్మ, సీపీఐ నాయకుడు పుల్కారం మల్లేష్ పాల్గొన్నారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో (డీఎంఫ్)నిధుల నుంచి మూంజూరైన నిధులతో శిక్షణ కేంద్ర భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే సామేల్ శంకుస్థాపన చేశారు. కంచనపల్లి కస్తూర్బా పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి, పీహెచ్‌సీ భవనానికి, సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఈ శివకుమారు, ఈఈ విరూపాక్షి, ఏఈ సురేష్, సింగిల్ విండో వైస్ చైర్మన్ చేడె చంద్రయ్య, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండిగ జోసఫ్, ఎంపీటీసీ పెండ్యాల భారతమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ నిమ్మనగోటి జోజి, కాంగ్రెస్ నాయకులు కూకునూరి విష్ణువర్ధన్ రెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, పాశం సత్యనారాయణ ఉన్నారు.

సంక్షిప్తంగా..

మోత్కూరు: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాలకు ఆర్థిక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ఎన్నికల జిమ్మిక్కని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య ఆరోపించారు. మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అలవికాని హామీలను నమ్మవద్దన్నారు.

మోత్కూరు : ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించి, విద్యార్థులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దాలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత అన్నారు. మోత్కూరు అంగడి బజారులోని ప్రాథమిక పాఠశాలలో వేమన ఫౌండేషన్, ఎస్ఎస్‌బీఎస్ కళాశాల అనంతపురం వారి సహకారంతో జన విజ్ఞాన వేదిక, ప్రజాభారతి సంస్థలు విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు నిర్వహించాయి. విజేతలకు వారు బహుమతులు అందజేసి మాట్లాడారు.

మోత్కూరు : మోత్కూరులో ప్రతి ఆదివారం అంగడి (పశువులు, గొర్రెలు, మేకల సంత), ౘైబజార్ నిర్వహిస్తున్నట్టు బుధవారం తిరుమలగిరి, అమ్మనబోలు సంతల్లో మునిసిపల్ సిబ్బంది చేత కరపత్రాలు పంపిణీ చేయించి, విస్తృత ప్రచారం చేయించారు.

భూదాన్‌పోచంపల్లి : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల హెచ్ఎం రమాదేవి అన్నారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థులు పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, కమలకుమారి, హరిత, అన్వర్, సుల్తానా, రమాదేవి, హిమబిందు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని బసవలింగేశ్వరస్వామి దేవాలయం వార్షిక కల్యాణ రథోత్సవాల్లో భాగంగా ముక్తాపూర్‌లో స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో దేవాలయం కమిటీ చైర్మన్ ఏనుగు మహిపాల్‌రెడ్డి, ధర్మకర్తలు వనం లక్ష్మణ్, కర్నాటి పురుషోత్తం పాల్గొన్నారు.

భువనగిరి టౌన్ : పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను వెంటనే పరిష్కరించాలని డీసీపీ ఎం.రాజేష్ చంద్రకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు ఇటుకల దేవేందర్, జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, ఎంఎస్పీ కోళ్ల జహంగీర్ ఉన్నారు.

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలంలోని కొడంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు గొలుసుల వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ బుధవారం వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

తుర్కపల్లి: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో డీఆర్‌డీఏ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఎన్నికల నియమనిబంధనలు, ఓటుపై అధికారులు అవగాహన కలిగించారు.

భూదాన్‌పోచంపల్లి : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్ అన్నారు. పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

బీబీనగర్: బీబీనగర్ శివారులోని సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ మహిళా కళాశాల విద్యార్థులు మండలంలోని రాఘవాపురం, రహీంగూడెం గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపును నిర్వహిస్తున్నారు. ప్రోగ్రామ్ నిర్వాహకురాలు విజయలక్ష్మీ, స్రవంతి, ప్రతిభ, సంతోష పాల్గొన్నారు.

రామన్నపేట: బీజేపీ జిల్లా కార్యదర్శిగా వెల్లంకి గ్రామానికి చెందిన తాటిపాముల శివకృష్ణగౌడ్‌ను నిమించారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ శివకృష్ణకు నియామక పత్రాన్ని అందజేశారు.

ఎన్నికల్లో లబ్ధి పొందడానికి సీఏఏ: సీపీఐ

సంస్థాన్‌నారాయణపురం, మార్చి 13: దేశంలో ప్రజలను మత ప్రాతిపదికపై విభజించి ఎన్నికల్లో లబ్ధి పొందడానికే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో బుధవారం సీపీఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలను విభజించి పరిపాలన సాగిస్తోందని అన్నారు. మతం అనేది భారత పౌరసత్వం పొందడానికి ఎన్నడూ ప్రాతిపదిక కాదని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, కె.శ్రీనివాస్, బచ్చనగోని గాలయ్య, దుబ్బాక భాస్కర్, దేశిడి నరేందర్ రెడ్డి,పల్లె మల్లారెడ్డి, ముత్యాల అంజయ్య, తోకల రాంరెడ్డి, భీమనపల్లి గాలయ్య, మన్నె భీమారెడ్డి, రమేష్, రాములు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి: శ్రీరాములు


భువనగిరి అర్బన్, మార్చి 13: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం బాధితులు చేపట్టిన ధర్నాకు సంఘీభావం తెలిపారు. అనంతరం స్పెషల్ కలెక్టర్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ భువనగిరి మండలం హన్మాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 28లో 76 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించి, అక్కడి నిరుపేదలను ఆదుకోవాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ మాట్లాడుతూ ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు వెంటనే కేటాయించాలని లేనిచో ఆందోళన ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో భువనగిరి పార్టీ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, నాగపురి యాదగిరి, మారగోని ప్రవీణ్‌కుమార్, బండారి ప్రభాకర్, రవీందర్, నరసింహ, ఏనుగు సుస్మిత, పత్తి వెంకటమ్మ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: అర్హులైన పేదలందరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేశ్ అన్నారు. బుధవారం ఆలేరులో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాటూరి జానమ్మ, సరళ, నాగమణి, వెంకటేష్, మల్లేశం, లక్ష్మీ, విజయ, జహంగీర్‌బీ ఉన్నారు.

వడపర్తి కత్వలోకి గోదావరి జలాలను మళ్లించాలి

భువనగిరి రూరల్, మార్చి 13: మండలంలోని వడపర్తి కత్వలోకి కొండపోచమ్మ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను మళ్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వడపర్తి గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో సాగునీరు అందక చేతికొచ్చిన పంటపొలాలు ఎండిపోతున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం గోదావరి జలాలతో ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలను నింపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పొండాల మైసయ్య, అంజనేయులు, రైతులు నర్సింహ, జంగయ్య, వెంకటేష్, కొండల్‌రెడ్డి, శంకరయ్య ఉన్నారు.

భువనగిరి నుంచి పోటీకి అవకాశం కల్పించాలి


దీపాదాస్‌మున్షీకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

చౌటుప్పల్ టౌన్, మార్చి 13: భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు (బీసీ) అవకాశం కల్పించాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్‌లో బుధవారం టీపీసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని శ్రీనివాస్ కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భూదాన్ పోచంపల్లి, సిరిపురం చేనేత సహకార సంఘాల మాజీ చైర్మన్‌లు బి.వాస్‌దేవ్, ఎ.రామేశ్వరం, లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: ప్రభుత్వం వివిధ సమాజాకిక వర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ బుధవారం భువనగిరిలో ముదిరాజ్, పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం నిర్ణయంతో ఇప్పటి వరకు అణగారిన వర్గాలుగా ఉన్న ముదిరాజులు, పద్మశాలీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని ఆయా సంఘాల నాయకులు అన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ముదిరాజ్ సంఘం నాయకులు, మునిసిపల్ మాజీ చైర్మన్ పెంట నర్సింహ, కూర వెంకటేశ్, కె సోమయ్య, గొర్రెంకల శివశంకర్, సాదు విజయ్‌కుమార్, ఇట్టబోయిన గోపాల్, భాషబోయిన రాజేష్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదినారాయణ ఉన్నారు.


ఆలేరులో రేవంత్‌రెడ్డి ప్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

● తుర్కపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో మండల వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఆయిలయ్య సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు. కార్యక్రమంలో మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వెలిదె కనకరాజు, మాజీ సర్పంచ్ తడ్క బాల్‌రాజు, ఉపాధ్యక్షులు కందుకూరి అమర్‌నాథ్, చింత లక్ష్మయ్య, కోషాధికారి కందుకూరి బాల్‌రాజు, తాజా మాజీ ఉపసర్పంచ్ సముద్రాల వెంకటేశ్, సంఘం నాయకులు బచ్చు నాగరాజు, సముద్రాల నర్సయ్య, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కుకుటపు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

● మోత్కూరు మండలంలో అయా సమాజిక వర్గాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు పోచం బిక్షపతి, లింగాయత్‌ల సంఘం జిల్లా నాయకురాలు కర్నే జ్యోతి, మాదాసు నర్సింహ, కృష్ణ, అర్వపల్లి, శంకరయ్య, పట్వారి అంజయ్య, ఆరాని శశి, ఎస్.నరేష్, శేఖర్, శివ, కన్నయ్య ఉన్నారు.

● ఆలేరులో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్‌లు, నాయకులు కూళ్ల నర్సింహులు, చిక్క శ్రీనివాస్, ఎగ్గిడి శ్రీశైలం, యాదగిరి, పర్వతాలు, రాములు, గాజుల లావణ్య, కృష్ణమూర్తి, సిద్దులు, గుర్రాల బాలకృష్ణ, పసుపునూరి వీరేశం, ఐత వెంకటేష్, సముద్రాల కుమార్ ఉన్నారు.


భువనగిరిలో రేవంత్ ప్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

● చౌటుప్పల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సీతారామచంద్ర స్వామి దేవస్థానం చైర్మన్ బొబ్బిళ్ల మురళి, నాయకులు బడుగు లక్ష్మయ్య, చిక్క నర్సింహ్మ, సుర్వి నర్సింహ, మంచికంటి భాస్కర్, కె.చంద్రశేఖర్, పాలడుగు వెంకటేశ్, కౌన్సిలర్ కె.శైలజ, గోశిక రవి, వినయ్, పాండురంగ పాల్గొన్నారు.

● పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు ప్రకటనపై డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జెల్ల వెంకటేశం హర్షం వ్యక్తం చేశారు. రామన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

● భూదాన్‌పోచంపల్లిలో పద్మశాలి చేనేత సంఘం నాయకులు తడక వెంకటేష్, భారత లవకుమార్, మెరుగు యతినందం, అంకం పాండు, గోలి యాదగిరి, ఆర్.శ్రీనివాస్, శశికళ హర్షం వ్యక్తం చేశారు.